క్లుప్తంగా

పోలీసుల కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఆంధ్రా కాలనీ నుంచి పాతబస్టాండ్ వరకు పోలీసులు, బెటాలియన్ సిబ్బంది ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. రాబోవు ఎన్నికల దృష్ట్యా ప్రజలకు భరోసా కల్పించేందుకు కవాతు నిర్వహించినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సీఐ క్రిష్ణ, ఎస్సైలు లక్ష్మణ్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు స్ఫూర్తి.. ప్రజాస్వామ్య దీప్తి



ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

దండేపల్లి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు, భారత ఎన్నికల సంఘం అధికారులు ఓటు హక్కుపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. ఓటు హక్కు బాధ్యతను తెలియజేసేందుకు జిల్లా ఎన్నికల అధికారులు గ్రామాల కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఓటుహక్కు వినియోగంపై వినూత్న ప్రచారం నిర్వహిస్తున్నారు. 'ఉజ్వల భవిష్యత్‌కు ఓటు మీ హక్కు' నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను.. అంటూ ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

'బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం'


ప్రచారం చేస్తున్న స్రవంతి రఘునాథ్

మంచిర్యాలటౌన్: వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని, బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ సతీమణి స్రవంతి అన్నారు. జిల్లా కేంద్రంలోని గోపాల్‌వాడ, ఏ క్యాబిన్ ఏరియాలో ఆదివారం బీజేపీ తరుపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంచిర్యాల పట్టణం అభివృద్ధి కేవలం రఘునాథ్‌ను గెలిపిస్తేనే సాధ్యమని ప్రజలకు వివరించారు.

కాంగ్రెస్‌లో చేరిక


వినోద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువకులు

కాసిపేట: మండల కేంద్రంలో ఆదివారం బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం వినోద్ ఆధ్వర్యంలో మాజీ బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పుర్ర కుమారస్వామి యాదవ్ 100మంది యువకులతో కాంగ్రెస్‌లో చేరగా, వారికి వినోద్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ మండలాధ్యక్షుడు సిద్దం తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్, నాయకులు రాజమౌళి, రమేష్, స్వామి, వెంకటేష్, శంకర్, పుర్ర పోశం, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: కాంగ్రెస్‌పార్టీలో వలసలు ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి బెల్లంపల్లిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్‌కు మద్దతుగా తాండూర్ మండల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ సిరంగి శంకర్, ఏఎంసీ డైరెక్టర్ పెద్ద బో యిన శంకర్, మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్లు మాసాడి తిరుపతి, దేవరకొండ రాజన్న, బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు మనోహర్ గౌడ్, రాజీవ్‌నగర్ ఉపసర్పంచ్ పగడాల రవీందర్ తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరగా వీరికి వినోద్ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు.

ఏడు నెలల్లో రూ.1.84 కోట్లే..!

- పన్నుల వసూలులో అలసత్వం
- 2023- 24లో ఆస్తి పన్నుల టార్గెట్ రూ.4.55కోట్లు
- ఇంకా లెక్కతేల్చని 'సింగరేణి'
- కుంటుపడుతున్న పట్టణ అభివృద్ధి
- నస్పూర్ మున్సిపాలిటీ తీరిది..


నస్పూర్ మున్సిపాలిటీ కార్యాలయం

నస్పూర్: మున్సిపాలిటీలో ఆస్తి పన్ను వసూళ్లలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణ అభివృద్ధి కోసం కేటాయించాల్సిన నిధులను వారి జీతాల కోసం, ఈపీఎఫ్ కట్టేందుకు వాడుతున్నారు. దీంతో పట్టణ అభివృద్ధి కుంటుపడుతోంది. నిధులు మళ్లిస్తున్న విషయం పాలకవర్గానికి తెలిసినా, వారు సైతం ప్రశ్నించకపోవడంతో అధికారులు ఆడిందే ఆటగా మారుతోంది.

దృష్టి సారించని అధికారులు...

2023–24 ఆర్థిక సంవత్సరం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం17,198 అసెస్‌మెంట్లు ఉండగా, ఆస్తి పన్నుల టార్గెట్ రూ.4.55కోట్లు. ఈ ఆర్థిక సంవత్సరం మొదలైన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.1.84కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఈ వసూళ్లలో సింగరేణి అధికారులే రూ.50లక్షలు చెల్లించగా, మున్సిపల్ సిబ్బంది వసూలు చేసింది కేవలం రూ.1.34కోట్లు మాత్రమే. మరోవైపు ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో ఐదు నెలలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ ఐదు నెలల్లో ఇంకా రూ.2.71కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉంది. గడిచిన ఏడు నెలల్లో రూ.రెండు కోట్లు కూడా వసూలు చేయని అధికారులు, ఐదు నెలల్లో ఎలా లక్ష్యాన్ని చేరుకుంటారో వేచి చూడాలి.

జీతాలకు, ఈపీఎఫ్‌లకు కేటాయింపు...

ప్రతి నెలా మున్సిపాలిటీ పరిధిలో పన్నులు వసూలు చేసి వాటిని ఉద్యోగుల జీతభత్యాలకు, ఈపీఎఫ్, ఇతరత్ర పనులకు కేటాయించాలి. కానీ వసూళ్లు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుండటంతో సిబ్బందికి ఇవ్వాల్సిన జీతాలను పట్టణ అభివృద్ధి కోసం కేటాయించిన నిధుల నుంచి ఇస్తుండటంతో పాటు ఈపీఎఫ్ సైతం ఈ నిధుల నుంచే చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు ఈపీఎఫ్ కోసం రూ.1.53కోట్లు, సిబ్బంది జీతాల కోసం రూ.24.31లక్షలు కేటాయించారు. పట్టణ అభివృద్ధి కోసం వాడాల్సిన నిధులను ఇలా మళ్లించడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇంకా లెక్కతేల్చలే..

మున్సిపాలిటీ పరిధిలో సింగరేణి గనులు, కార్మికులు, అధికారుల కోసం వేల సంఖ్యలో నిర్మించిన క్వార్టర్లు, అధికారుల కార్యాలయాలు, ఫంక్షన్ హాళ్లు, ఓసీపీలు, సింగరేణి పాఠశాలలు, కళాశాలలు, సీవేజ్ ప్లాంట్లు తదితర సింగరేణి సంబంధిత ఆస్తులకు సింగరేణి యాజమాన్యం మున్సిపాలిటీకి పన్నులు చెల్లించాల్సి ఉంది. మున్సిపాలిటీ కాకముందు నస్పూర్, తీగల్‌పహాడ్, తాళ్లపల్లి, సింగాపూర్ గ్రామ పంచాయతీల కింద ఇవన్నీ ఉండేవి. జీపీ లెక్కల ప్రకారం ప్రతి ఏడాది సింగరేణి నాలుగు పంచాయతీలకు రూ.47లక్షలు పన్నులు చెల్లించేది. 2018తరువాత ఈ నాలుగు జీపీలు కలిసి నస్పూర్ మున్సిపాలిటీగా మారాయి. మున్సిపాలిటీల పన్నుల చట్టం ప్రకారం సింగరేణి ఆస్తులను రీ సర్వే చేసి సుమారు రూ.1.90కోట్లు చెల్లించాలని మున్సిపల్ అధికారులు అంచనా వేసి సింగరేణి యాజమాన్యానికి నోటీసులు అందించారు. ఈ ఏడాది సింగరేణి యాజమాన్యం పాత లెక్కల ప్రకారమే రూ.50లక్షలు చెల్లించడం గమనార్హం. పెంచిన ఆస్తి పన్ను ప్రకారం సింగరేణి యాజమాన్యం ఆస్తి పన్ను చెల్లిస్తుందా! లేదా! అనేది తేలాల్సి ఉంది.

'సింగరేణి' పన్ను చెల్లిస్తే అన్నీ సర్దుకుంటయ్..

పట్టణంలో సింగరేణి సంస్థ ఆస్తులు ఎక్కువగా ఉన్నాయి. మున్సిపల్ చట్టం ప్రకారం సింగరేణి పెరిగిన ఆస్తుల పన్ను చెల్లించాల్సి ఉంది. మున్సిపల్ ఉన్నతాధికారులతో మాట్లాడి పెరిగిన ఆస్తిపన్ను చెల్లింపులో నిర్ణయం తీసుకుంటామని సింగరేణి అధికారులు తెలిపారు. జనరల్ ఫండ్‌లో నిధులు లేనందునా ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని పట్టణప్రగతి నిధులు ఇతర అవసరాలకు మళ్లించాము.

– తన్నీరు రమేశ్, మున్సిపల్ కమిషనర్

'బీఆర్ఎస్ ఓటమే నేతకాని లక్ష్యం'


మాట్లాడుతున్న మీసాల రాజు

చెన్నూర్: నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ ఓటమే లక్ష్యంగా నేతకాని కులస్తుల లక్ష్యంగా పనిచేయాలని నేతకానీ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మీసాల రాజు అన్నారు. పట్టణంలో ఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఆదివారం ఏర్పాటు చేయగా ఆయన మాట్లాడారు. చెన్నూర్ నియోజకవర్గంలో నేతకాని కులస్తుల జనాభా ఎక్కువగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నేతకానీలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నేతకానీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, దళితబంధు లాంటి పథకాలు అందడం లేదన్నారు. నేతకానీ కులస్తులను గుర్తించిన పార్టీకే మద్దతు ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఎన్ఎస్ఎఫ్ నాయకులు గోపాల్, రమేశ్, పరమేశ్, మనోహర్, ప్రేమ్‌కుమార్, వినోద్, రాజేశ్, చరణ్ పాల్గొన్నారు.

అలరించిన కవితాగానం

మంచిర్యాలఅర్బన్: స్థానిక సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం సంస్కృత కవి వాల్మీకి జయంతి సందర్భంగా నిర్వహించిన కవితాగానం అలరించింది. సంగీత సాహిత్య సుధావాహిని సంస్థ ఆధ్వర్యంలో దాసరి శ్రీనాథ్‌గౌడ్ అధ్యక్షతన రామాయణం గురించి బిజుమల్ల ఆనందర్‌రావు ప్రసంగించారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కవులు మలయశ్రీ, సుజాత, అల్లాడి శ్రీనివాస్, బ్రహ్మయ్య, చంద్రశేఖర్, ప్రసాద్, సత్యానారాయణ, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే పేదలకు లబ్ధి

- ఎమ్మెల్యే దివాకర్‌రావు


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తేనే పేద ప్రజలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతాయని, అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 3వ వార్డులో ఇంటింటికీ వెళ్లి, బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రైతులు, దివ్యాంగులకు, దళితులకు ఇలా ప్రతి ఒక్కరికి ఏదో ఒక రూపంలో ప్రజలకు లబ్ధిని చేకూర్చడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమన్నారు. నవంబర్ 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఇంటింటా ఎమ్మెల్యే పర్యటన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఇంటింటా పర్యటించారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి విజయాన్ని అందించి అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, నాయకులు బేర పోశం, లగిశెట్టి రాజయ్య, దొమ్మటి బాపు, స్థానికులు పాల్గొన్నారు. గఢ్‌పూర్, గుడిపేటకు చెందిన పలువురితో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే దివాకర్ రావు సమక్షంలో పార్టీలో చేరారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్


సీసీసీలో ప్రచారం నిర్వహిస్తున్న రఘునాథ్

నస్పూర్: రాబోయే ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని జిల్లా బీజేపీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. పట్టణంలోని సీసీసీ లక్ష్మీనగర్, ప్రశాంత్‌నగర్‌లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో స్వచ్ఛమైన శుద్ధ జలాలను అందిస్తామని తెలిపారు. బీజేపీకి ఓటు వేసి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అనంతరం అల్లూరి సీతారామరాజు నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 200మంది బీజేపీలో చేరగా, వారికి రఘునాథ్ బీజేపీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఈర్ల సదానందం, ఉపాధ్యక్షుడు సామ్రాట్ రమేశ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కొండ వెంకటేశ్, నాయకులు రానవేన శ్రీనివాస్, కోరెపు మహేందర్, హల్ల వెంకటేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండి సేవచేస్తా

- మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్


తిమ్మాపూర్‌లో కార్యకర్తలతో ప్రచారంలో రమేశ్

జన్నారం: ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని, మండలంలోని సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేయాలని మాజీ ఎంపీ, బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి రాథోడ్ రమేశ్ పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపూర్, రాంపూర్ గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి మద్దతు తెలుపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోలి చందు, శంకరయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

'రఘునాథ్‌కే టికెట్ ఇవ్వాలి'

తాండూర్: మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ టికెట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌కే ఇవ్వాలని అధికార ప్రతినిధి చిలుముల శ్రీ కృష్ణదేవరాయలు కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. మంచిర్యాలలో బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసిన ఘనత రఘునాథ్‌దే అన్నారు. అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి, ప్రజల మదిలో నిలిచి ఉన్న రఘునాథ్‌కు పార్టీ టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలుపొందడం తధ్యమని తెలిపారు. టికెట్ కేటాయింపులో రాష్ట్రస్థాయి అధికారులు దృష్టి సారించాలని కోరారు.

'నిరుపేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి'

చెన్నూర్‌రూరల్: ఆరు నెలలుగా మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలో ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే వారికి స్థలాలతో పాటు ఇళ్లు కట్టివ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చందు, అవేజ్, పోచక్క, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'డ్రైవర్ల సమస్యలు తీర్చకపోతే ఎన్నికల్లో పోటీచేస్తాం'

బెల్లంపల్లి: ఆటో డ్రైవర్ల సమస్యలు తీర్చడానికి ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థులు ముందుకు రాకపోతే తాము ఎన్నికల్లో ఓ అభ్యర్థిని పోటీలో నిలబెడతామని బెల్లంపల్లి ఆటో యూనియన్ అధ్యక్షుడు కట్ట రాంకుమార్ తెలిపారు. ఆటో డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుండా ప్రజాప్రతినిధులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డా, ఆటో డ్రైవర్ల బతుకుల్లో ఎలాంటి మార్పు లేకుండా పోయిందని తెలిపారు. ఈ సారి జరిగే ఎన్నికల్లో ఆటో డ్రైవర్ల సమస్యలు తీర్చేందుకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో మేనిఫెస్టోలో తమ సమస్యలను ప్రస్తావించే పార్టీకి మద్దతు ప్రకటిస్తామన్నారు. లేకపోతే తమలో ఒకరిని పోటీలో నిలబెట్టి సత్తా చాటుతామని స్పష్టం చేశారు. సమావేశంలో ఆటో డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

వేమనపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి తనకు ఓటు వేయాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కోరారు. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేణుమాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం వేమనపల్లి మండలంలోని ముల్కలపేట, కల్మలపేట, నీల్వాయి, గొర్లపల్లి, దస్నాపూర్ గ్రామాల్లో భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు వస్తే ప్రజల ముందుకు వచ్చే వినోద్ లాంటి నాయకులను నమ్మొద్దన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో రూ. వేల కోట్ల వ్యాపారికి, పేదింటి బిడ్డనైన తనకు మధ్య ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో ఉండే వారికి ప్రజల కష్టాలు తెలియవని, ప్రజలకు అందుబాటులో ఉండరని సూచించారు. ఎన్నికలు రాగానే పదవుల కోసం పార్టీలు మారే వినోద్‌లాంటి నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. పేదింటి బిడ్డలు గురుకులాల్లో సన్నబియ్యం తిని చక్కగా చదువుకుంటున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణలత, బీఆర్ఎస్ పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ, లక్ష్మీకాంత్, భీమయ్య, సర్పంచ్‌లు మధుకర్, పద్మ, మొండి, బాపు, రమేష్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'గడపగడపకూ పీఎస్సార్'


జాఫర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న సురేఖ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావును భారీ మెజారిటీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని 30వ వార్డు జాఫర్‌నగర్‌లో ఆదివారం ఆమె గడపగడపకూ పీఎస్సార్ కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ రావుల ఉప్పలయ్యతో కలిసి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో అమలు చేసే ఆరు గ్యారంటీ హామీలను ప్రజలకు వివరించారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కాంగ్రెస్ పార్టీ హాజీపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గడపగడపకూ ప్రచారం నిర్వహిచారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే ఆరు గ్యారంటీ హామీలను ఇంటింటికీ వివరిస్తూ, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావును గెలిపించాలని కోరారు. ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, ఒడ్డె శ్రీనివాస్, ఒడ్డె రాజమౌళి, సాంబారి కుటుంబరావు, రాజు, నల్ల వెంకటేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక


నినాదాలు చేస్తున్న శ్రేణులు

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉంటున్న పలువురు బీజేపీలో చేరారు. మున్సిపాలిటీలోని 5, 6, 7వార్డులకు చెందిన మహిళలు, యువకులు, వయోజనులు కాషాయం కండువా కప్పుకున్నారు. దాదాపు 400మంది పార్టీలో చేరినట్లు బీజేపీ బెల్లంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి అమురాజుల శ్రీదేవి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అసెంబ్లీ నియోజకవర్గంలో ఏకైక మహిళ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సారి ఎన్నికల్లో అధిక మెజార్టీతో తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ రాజులాల్, నాయకులు మహేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



గంగాదేవి నిమజ్జనం

వేమనపల్లి: గంగపుత్రుల ఇలవేల్పు గంగాదేవి నవరాత్రి ఉత్సవాలు మండలంలో ఆదివారం ముగిశాయి. బెస్తవాడకు చెందిన సుమారు 200 కుటుంబాలు గంగదేవి నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. డీజే పాటలు, యువకుల, మహిళలు నృత్యాలతో హోరెత్తించారు. అనంతరం గంగాదేవి విగ్రహాన్ని 'ప్రాణహిత'లో నిమజ్జనం చేశారు.

గుంతలమయంగా జాతీయ రహదారి


మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిపై గుంత



63వ నంబర్ మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిని రూ.150కోట్లతో నాలుగు వరుసల రోడ్డుగా ఈ మధ్యకాలంలో విస్తరించారు. రోడ్డు నిర్మాణం పూర్తిచేసుకుని ఏడాది కూడా కాకముందే రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మించిన కొద్దిరోజులకే ఇలా పాడైపోవడంతో వాహనదారులు, స్థానికులు అధికార యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– జైపూర్

తెరుచుకున్న ఆలయం



దండేపల్లి: చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మూసివేశారు. ఆదివారం ఉదయం ఆలయ సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం దర్శనానికి అనుమతించారు.